సాక్షి విశాఖపట్నం

ఆదివారం । 4 । ఆగస్టు । 2024



ఉత్సాహంగా తైక్వాండో పోటీలు

జాతీయ తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీల్లో రెండో రోజు శనివారం ఉత్సాహంగా సాగాయి. సీపీ బహుమతులు అందజేశారు. 8లో



అవయవదానంపై అపోహ వద్దు

అపోహలు వీడి అవయవదానానికి అందరూ స్వచ్ఛందంగా ముందుకు రావాలని కలెక్టర్ హరేందిర ప్రసాద్ పిలుపునిచ్చారు. 8లో



హ్యాపీ ఫ్రెండ్‌షిప్ డే

ఫ్రెండ్ దగ్గర ఉంటే హాయిగా హగ్ చేసుకోండి. లేదంటే ఫోన్ తీసుకొని హ్యాపీ ఫ్రెండ్‌షిప్ డే అంటూ విష్ చేయండి. 8లో

న్యూస్‌రీల్

శ్రావణ శుక్రవారాల్లో లక్ష కుంకుమార్చన

సింహాచలం: శ్రావణ శుక్రవారాల్లో సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో కొలువుదీరిన సింహవల్లీ తాయారు సన్నిధిలో లక్ష కుంకుమార్చన జరిపించనున్నట్లు దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. ఈ నెల 9, 16, 23, 30 తేదీల్లో ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు ఈ ఆర్జిత పూజ పూజ జరుగుతుందన్నారు. పూజలో పాల్గొనే భక్తులు రూ. 2,500 టిక్కెట్ తీసుకోవాల్సి ఉంటుందన్నారు. అలాగే శ్రావణ శుక్రవారం రోజుల్లో సింహవల్లీ తాయారు సన్నిధిలోనే సాయంత్రం 5.30 నుంచి 6 వరకు సహస్ర నామార్చన జరుగుతుందని, భక్తులు రూ.500 టిక్కెట్ తీసుకుని పాల్గొనవచ్చని తెలిపారు.

14 స్కూల్ బస్సులపై కేసులు



నగరంలో స్కూల్ బస్సును తనిఖీ చేస్తున్న రవాణా శాఖ అధికారులు

గోపాలపట్నం: నగరంలో శని, ఆదివారాల్లో పలు చోట్ల చేపట్టిన తనిఖీల్లో 14 స్కూల్, కళాశాల బస్సులు, ఒక ఆటోపై కేసులు నమోదు చేశామని రవాణా శాఖ ఉప కమిషనర్ రాజారత్నం తెలిపారు. జూన్ 13 నుంచి చేపట్టిన తనిఖీల్లో ఇప్పటి వరకు 74 స్కూల్, కాలేజీ బస్సులపై కేసులు నమోదు చేశామని, వాటిలో 8 బస్సులను సీజ్ చేశామని తెలిపారు. 26 ఆటోలపై కేసులు నమోదు చేసి, మరో 5ఆటోలను సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. ఈ తనిఖీల్లో ఎంవీఐలు బాలాజీరావు, మన్మోహన్, రాజారావు, ఐ.మాధవి, దుర్గాప్రసాద్, పార్వతి, సిబ్బంది పాల్గొన్నారు.

పోస్టింగ్ కోసం 15 మంది తహసీల్దార్ల దరఖాస్తు

మహారాణిపేట : తహసీల్దార్లు బదిలీలకు అనుమతి ఇవ్వాలని ఎన్నికల కమిషన్‌కు కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ లేఖ రాశారు. ఎమ్మెల్సీ ఉప ఎన్నికతో కోడ్ అమల్లో ఉంది. దీంతో తహసీల్దార్లు బదిలీలకు అవకాశం లేదు. ఈ నేపథ్యంలో భూమి శిస్తు ముఖ్య కమిషనర్ (సీసీఎల్ఎ) కొన్ని నిబంధనలు అమలు చేశారు. తహసీల్దార్లు సొంత డివిజన్లలో పనిచేయకూడదని, ఎన్నికల ముందు ఎక్కడ పనిచేశారో అక్కడ పోస్టింగ్ ఇవ్వొద్దని ఆదేశిస్తూ విశాఖ ఉమ్మడి జిల్లాల్లో తహసీల్దార్లు బదిలీల బాధ్యత విశాఖ జిల్లా కలెక్టర్ హరేందిర ప్రసాద్‌కు అప్పగించారు. అయితే ఎన్నికల షెడ్యూల్ రాక ముందే విశాఖలో 21 మంది తహసీల్దార్లకు బదిలీ ప్రక్రియ పూర్తి చేశారు. అనకాపల్లి, ఏఎస్ఆర్ జిల్లాల్లో ఇంకా బదిలీలు జరగలేదు. సీసీఎల్ఏ ఆదేశాల ప్రకారం విశాఖలో మళ్లీ బదిలీలు జరిగే అవకాశం ఉంది. విశాఖలో పనిచేయడానికి ఇప్పుడు 15 మంది తహసీల్దార్లు జిల్లా కలెక్టర్‌కు దరఖాస్తు చేసుకున్నారు. ఎన్నికల కమిషన్ అనుమతి ఇస్తే.. ఉమ్మడి విశాఖ జిల్లాల కలెక్టర్లు చర్చించుకుని బదిలీ ప్రక్రియ చేపట్టే అవకాశం ఉందని రెవెన్యూ వర్గాలు చెబుతున్నారు.

స్థాయీ సంఘం ఎన్నికల బరిలో 20 మంది

సాక్షి, విశాఖపట్నం: జీవీఎంసీ స్థాయీ సంఘం ఎన్నికల బరిలో నామినేషన్లు వేసిన 20 మంది అభ్యర్థులు కూడా పోటీలో ఉన్నట్లు అదనపు కమిషనర్ ఎస్ఎస్ వర్మ ప్రకటించారు. జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్ కుమార్ ఆదేశాలతో నిర్వహించిన స్క్రూట్నీ అనంతరం ఎవరూ నామినేషన్లు ఉపసంహరించుకోలేదని తెలిపారు. అభ్యర్థుల జాబితాను జీవీఎంసీ ప్రధాన కార్యాలయం నోటీసు బోర్డులో పొందుపరిచినట్లు వివరించారు. 7వ తేదీ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ ఎన్నికలు జరుగుతాయని తెలిపారు.

డ్రైవర్ లేక ఆస్పత్రులకు అందని వ్యాక్సిన్లు

మహారాణిపేట: జిల్లా ఇమ్యూనైజేషన్ శాఖకు చెందిన వ్యాన్ డ్రైవర్ రిటైర్ కావడంతో పీహెచ్‌సీలకు, ఇతర ప్రభుత్వ ఆస్పత్రులకు వ్యాక్సిన్ల సరఫరా నిలిచిపోయింది. పీహెచ్‌సీలు, ఇతర ప్రభుత్వాస్పత్రులకు పెదవాల్తేరులోని విశాఖ ఇమ్యునైజేషన్ సెంటర్ నుంచి వ్యాక్సిన్ సరఫరా చేస్తారు. ఇక్కడ డ్రైవర్ అందుబాటులో లేక మూడు రోజులుగా వ్యాక్సిన్ వెళ్లలేదు. దీంతో జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వర రావు జోక్యం చేసుకొని రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో ఉన్న డ్రైవర్‌ను కేటాయించారు. ఆదివారం నుంచి అన్ని ప్రభుత్వ ఆస్పత్రులకు వ్యాక్సిన్లు పంపుతున్నట్టు డీఎంహెచ్‌వో తెలిపారు.

6న పీజీఆర్ఎస్ రద్దు

మహారాణిపేట: జిల్లాలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక షెడ్యూల్ ప్రకటించడం వల్ల ఈనెల 6వ తేదీన జరగాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంనిర్వహించడం లేదని కలెక్టర్ హరేందిర ప్రసాద్ తెలిపారు.

చిరువ్యాపారులపై ఎందుకీ పగ?

రెక్కాడితే కాని డొక్కాడని చిరువ్యాపారులపై జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ ప్రతాపం చూపించాడు. తన దందాలకు సహకరించకుండా, ముడుపులు చెల్లించడం లేదన్న అక్కసుతో జూలు విదిల్చాడు. ఎన్నో కుటుంబాలను రోడ్డున పడేశాడు. కార్పొరేటర్‌గా గెలిచినప్పటి నుంచి దుకాణదారులతో నిత్యం తగాదాలు పెట్టుకుంటూ వారిని ఎలాగైనా అక్కడి నుంచి తరిమెయ్యాలన్నదే టార్గెట్‌గా పెట్టుకొని ఇప్పుడు తన ప్రతీకారాన్ని తీర్చుకున్నాడు.

- రోడ్డు పక్క దుకాణాలపై జనసేన కార్పొరేటర్ మూర్తియాదవ్ ప్రతాపం
- జీవీఎంసీ సిబ్బంది సహకారంతో దుకాణాల తొలగింపు
- కార్పొరేటర్‌గా గెలిచినప్పటి నుంచి చిరువ్యాపారులతో నిత్యం తగాదాలు
- వాటిని తొలగించేందుకు హైకోర్టు నుంచి ఆదేశాలు తీసుకొచ్చిన వైనం
- రోడ్డున పడ్డ వందలాది మంది చిరువ్యాపారులు



దుకాణాల ముందుభాగాన్ని ధ్వంసం చేసిన జీవీఎంసీ సిబ్బంది

నోటీసులు ఇవ్వకుండా షాపులు తీసేస్తారా.?



జీవీఎంసీకి కట్టిన పన్ను రసీదు చూపిస్తున్న మెకానిక్ సతీష్

20 ఏళ్లకుపైగా ఇక్కడే బైక్ రిపేర్ దుకాణాన్ని నడుపుతున్నాను. రూ.1800 పన్ను కూడా జీవీఎంసీకి కడుతున్నాం. ఇంతవరకూ ఇలా ఎవరూ మాపై ప్రతాపాన్ని చూపించలేదు. నిన్న రాత్రి ఇద్దరు జనసేన వాళ్లు వచ్చి.. బడ్డీలన్నీ రేపు తీసేస్తారు. చూస్కోండి అని అన్నారు. మరెక్కడైనా మాకు షాప్ పెట్టుకోడానికి అనుమతిస్తారా అని అడిగితే అదేం ఉండదంటూ వెళ్లిపోయారు. నోటీసులు కూడా ఇవ్వలేదు.. ఉదయాన్నే వచ్చి షాపులు తీసేస్తున్నారు. అడుగుతుంటే కార్పొరేటర్, కోర్టు ఆదేశాలని జీవీఎంసీ వాళ్లు చెబుతున్నారు.

– జి.సతీష్, మెకానిక్ షాప్, బాధితుడు

సాక్షి, విశాఖపట్నం : జీవీఎంసీ 22వ వార్డు పిఠాపురం కాలనీ ప్రాంతంలో ఎన్నో ఏళ్లుగా చిరు వ్యాపారులు రోడ్లపై చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటూ బతుకులీడుస్తున్నారు. 2021లో కార్పొరేషన్ ఎన్నికల్లో ఆ వార్డు నుంచి కార్పొరేటర్‌గా ఎన్నికైన జనసేన నాయకుడు పీతల మూర్తియాదవ్.. ఆ దుకాణాలను అక్కడి నుంచి తొలగించేందుకు విశ్వ ప్రయత్నాలు చేశారు. వ్యాపారుల పొట్ట కొట్టకూడదన్న ఉద్దేశంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వారికి రక్షణ వలయంగా నిలిచింది. దీంతో మూర్తి యాదవ్ వారి జోలికి వెళ్లకుండా ఆగారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మళ్లీ జనసేన కార్పొరేటర్ జూలు విదిల్చారు. ఎలాగైనా అక్కడి నుంచి దుకాణాలు తొలగించాలంటూ హైకోర్టులో కేసులు వేసి ఆర్డర్లు తెప్పించుకున్నారు. అక్కడ ఉన్న వందల దుకాణదారులకు ఎలాంటి ముందస్తు నోటీసులు జారీ చేయకుండానే కూల్చివేతలను శనివారం ఉదయం నుంచే మొదలు పెట్టారు.

మూకుమ్మడిగా వచ్చి.. భయభ్రాంతుల్ని చేసి..

ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే జీవీఎంసీ సిబ్బంది పెద్దసంఖ్యలో వచ్చేశారు. ఉదయం పూట వ్యాపారాలు చేసుకుంటున్న చిరువర్తకులు జీవీఎంసీ, పోలీసు బలగాన్ని చూసి బెంబేలెత్తిపోయారు.



దుకాణాల వద్ద ఆందోళనలో చిరు వ్యాపారులు



భారీగా పోలీస్ బందోబస్తు

జేసీబీలతో దుకాణాలు బలవంతంగా తొలగించేశారు. నేలమట్టమవుతున్న దుకాణాలను చూసి తీవ్ర ఆందోళన చెందారు. తమ జీవనాధారాన్ని తొలగించొద్దని అధికారులను ప్రాధేయపడ్డారు. ఓట్లేసి గెలిపించిన కార్పొరేటర్ తమ బతుకులను నాశనం చేస్తున్నారంటూ ఆక్రోశం వ్యక్తం చేశారు. స్థానికంగా ఉంటున్న జనసేనకు చెందిన ఎమ్మెల్యే వంశీకృష్ణ దగ్గరకు వెళ్తే పట్టించుకోలేదని తెలిసింది. దీంతో టీడీపీ ఎమ్మెల్యే వెలగపూడిని ఆశ్రయించగా తాత్కాలికంగా నిలిపివేయాలని చెప్పడంతో కొంత మేర కూల్చివేతలు ఆగాయి. ఎమ్మెల్యే పనులు నిలిపేశారని తెలుసుకున్న మూర్తి.. మళ్లీ జీవీఎంసీ అధికారులకు ఫోన్ చేసి హైకోర్టు ఆదేశాలు పాటించకపోతే కోర్టు ధిక్కరణ కేసులు పెడతానని బెదిరించినట్లు తెలుస్తోంది. జనసేన వైఖరికి నిరసనగా బాధిత వ్యాపారులంతా పిఠాపురం కాలనీ రోడ్డుపై బైఠాయించి నినదించారు.

కార్పొరేటర్ వైఖరిపై టీడీపీ నేతల మండిపాటు

కూటమిలో ఉంటూ చిరు వ్యాపారుల దుకాణాలను కూల్చేసిన వైనంపై టీడీపీ నేతలే మండిపడుతున్నారు. కోర్టు కెళ్లి మరీ దుకాణాల్ని కూల్చివేసేందుకు కుట్రలు పన్నడంపై కార్పొరేటర్ మూర్తియాదవ్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మూర్తి యాదవ్‌కు లాభసాటిగా ఉన్న భూములు, కబ్జాల గురించి తప్ప పేదల కష్టాలు నష్టాలు తెలియవని కొందరు వ్యాఖ్యానించారు. ప్యాకేజీలు తీసుకొని కార్పొరేటర్ ఏం చెప్తే అది చేయడం సరికాదని, జనాల సమస్యలు కూడా అర్థం చేసుకోవాలని అధికారులను కోరారు. హైకోర్టు ఆదేశాలు రావడంతో దుకాణాలు తొలగించే ప్రక్రియ ప్రారంభించామని జీవీఎంసీ అధికారులు తెలిపారు. మరోవైపు మూర్తి యాదవ్ వ్యవహారశైలిపై స్థానిక జనసేన నేతలంతా కలిసి పవన్‌కల్యాణ్‌కు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నారు.

పొట్టలు కొట్టారు..



పట్టణంలో బతుకుదామని పల్లె నుంచి వచ్చాం. ఇక్కడ అద్దె దుకాణంలో టిఫిన్ అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నాం. ఉదయం పెద్ద జేసీబీలు వచ్చాయి. వాటిని చూసి ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాం. మా దుకాణం రోడ్డుపైకి వచ్చిందంటూ దోశ పెనంతో కూడిన గ్యాస్ స్టవ్‌ను ఇతర సామగ్రిని రోడ్డుపై పడేశారు. మా పొట్టలు కొట్టారు.

– వి.రమణరావు, హోటల్ దోశ మాస్టర్

20 ఏళ్లుగా పన్ను చెల్లిస్తున్నాం..



గత 20 ఏళ్లుగా ఇక్కడే పాన్ షాపు నడుపుతున్నాను. కుటుంబమంతా దీని మీద ఆధారపడి జీవిస్తున్నాం. జీవీఎంసీకి పన్ను కూడా చెల్లిస్తున్నాం. మమ్మల్ని నడి రోడ్డు మీద పడేయాలని చూడటం దారుణం. కనీసం ముందస్తు సమాచారం లేకుండా మా షాపుల తొలగించాలని చూస్తున్నారు. మా షాపు కరెంటు కూడా కట్ చేసి మీటర్ తీసుకొని వెళ్లిపోయారు.

– సూర్యకుమారి, పాన్‌షాపు

కనీసం సమాచారం ఇవ్వలేదు



మేము గత కొనేళ్లుగా టిఫిన్ షాపు పెట్టుకొని జీవనం సాగిస్తున్నాం. మాకు ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా షాపును తొలగించారు. ఇలా అర్ధాంతరంగా షాపు తొలగించటంతో ఏమి చేయాలో తోచడం లేదు. మాకు అండగా ఉండాల్సిన ప్రజా ప్రతినిధులే దగ్గరుండి ఇలా చేయిస్తుంటే మా బాధలు ఎవరికి చెప్పుకోవాలో తెలియటం లేదు.

– కాస్తురయ్య, టిఫిన్ షాపు

బ్లాక్ మార్కెట్‌కు రేషన్ బియ్యం

- 3రోజుల్లో 15 టన్నుల బియ్యం స్వాధీనం

మహారాణిపేట: పేదల బియ్యం బ్లాక్ మార్కెట్‌కు తరలిపోతోంది. అధికారుల పర్యవేక్షణ లోపంతో ప్రజాపంపిణీ వ్యవస్థ గాడి తప్పుతోంది. కూటమి ప్రభుత్వ నిర్వాకం డీలర్ల పాలిట శాపంగా పరిణమిస్తోంది. రెండు నెలలుగా కమీషన్ ఇవ్వకపోవడంతో కొంత మంది డీలర్లు బియ్యాన్ని పక్కదారి పట్టిస్తున్నారు. బ్లాక్‌లో అధిక ధరకు విక్రయిస్తున్నారు. జిల్లాలో 648 చౌకధరల దుకాణాల షాపుల్లో మొత్తం 5,17,732 కార్డులకు గాను 8161 మెట్రిక్ టన్నుల బియ్యం పంపిణీ చేయాలి. జిల్లా సివిల్ సప్లయిస్ అధికారి పరిధిలో నగరంతో పాటు భీమిలి, పద్మనాభం, ఆనందపురం, పెందుర్తి మండలాలు ఉన్నాయి. రైస్‌కార్డులో ఒక్కో కార్డు సభ్యుడికి 5 కిలోలు చొప్పున బియ్యాన్ని ఉచితంగా అందిస్తున్నారు. అయితే కొంతమంది కార్డుదారులు బియ్యం విడిపించుకోడానికి ఆసక్తి చూపించడం లేదు. బియ్యం మినహా మరే ఇతర నిత్యావసరాలు పంపిణీ చేయకపోవడంతో మరికొందరు కార్డు రద్దు కాకుండా ఉండేందుకు బయోమెట్రిక్ వేసి బియ్యం



బియ్యం స్వాధీనం చేసుకున్న పౌరసరఫరాల సిబ్బంది

తీసుకోకుండానే వెళ్లిపోతున్నారు. కొందరు మాత్రం బియ్యాన్ని తీసుకొని తిరిగి వాహనదారులకే విక్రయిస్తున్నారు. కిలోకు రూ.10 చొప్పున కొనుగోలు చేస్తున్నట్టు సమాచారం. ఇలా సేకరించిన బియ్యాన్ని డీలర్లు నల్ల బజారుకు తరలిస్తున్నారు.

పలు సంస్థలపై 6ఎ కేసులు నమోదు

మూడు రోజుల వ్యవధిలో నగర పరిధిలో సివిల్ సప్లయిస్ అధికారులు దాడులు చేయగా..15 టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నారు. డీలర్లపై 6ఎ కేసులు నమోదు చేశారు. పలు అనధికార గోదాములు, డీలర్లు నుంచి బియ్యం స్వాధీనం చేసుకున్నారు. గాజువాక, న్యూకాలనీ, ఎన్ఏడీ కొత్తరోడ్డు, నాతయ్యపాలెం తదితర ప్రాంతాల్లో అనధికార గోదాముల్లో పీడీఎస్ బియ్యం స్వాధీనం చేసుకున్నారు. అక్కయ్యపాలెం డిపో నంబర్ 2లో 275 కిలోల బియ్యం అదనంగా ఉండడంతో 6ఎ కేసు నమోదు చేశారు.

మంత్రికి నా భర్త ఫ్రెండ్ అంటూ డీలర్ హల్‌చల్

అక్కయ్యపాలెం షాపు 2లో పీడీఎస్ బియ్యం అదనంగా ఉండడంతో పౌరసరఫరాల శాఖ సిబ్బంది శుక్రవారం సోదాలు నిర్వహించారు. సివిల్‌సప్లయిస్ మంత్రికి నా భర్త స్నేహితుడని, సోదాలు ఎలా నిర్వహిస్తారని డీలర్ హల్‌చల్ చేసింది. కొద్దిసేపు సిబ్బంది తటపాయించినప్పటికీ సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో లెక్కకు మించి 275 కిలోలు బియ్యం ఉండడంతో స్వాధీనం చేసుకొని 6ఏ కేసు నమోదు చేశారు.

3,800 కేజీల బియ్యం స్వాధీనం

మల్కాపురం సమీపంలోని ప్రకాష్‌నగర్‌లో అనధికార గోదాముల్లో నిల్వ చేసి 3,800 కిలోల బియ్యాన్ని పౌరసరఫరాల శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం రాత్రి గాజువాక ఏఎస్‌వో ఆధ్వర్యంలో సిబ్బంది దాడులు చేసి పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నారు. బియ్యం స్వాధీనం చేసుకొని 6ఏ కేసు నమోదు చేశారు.

ఎల్‌ఐజీ లేఅవుట్స్ తీసుకొస్తాం..

- విభిన్న ప్రాజెక్టులకు ప్రత్యేక మాస్టర్ ప్లాన్
- మధురవాడలో అర్బన్ ఎంటర్‌టైన్‌మెంట్ జోన్
- కాకానినగర్ వద్ద సబ్‌వే ఏర్పాటు చేస్తాం
- వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్



విశాఖసిటీ : వీఎంఆర్‌డీఏ పరిధిలో ప్రతి ప్రాంతం అభివృద్ధి చెందేలా వినూత్న ప్రాజెక్టులు, బృహత్ ప్రణాళికలతో అడుగులు వేస్తున్నామని వీఎంఆర్‌డీఏ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ తెలిపారు. ఆయన చాంబర్‌లో మీడియాతో శనివారం మాట్లాడారు. ప్రజలకు ఆహ్లాదం పంచడంతో పాటు ప్రకృతి పరిరక్షించే విధంగా ప్రాజెక్టులు రూపుదిద్దుకుంటున్నాయని పేర్కొన్నారు. భోగాపురం ఎయిర్‌పోర్టు సమీపంలో అదనంగా 500 ఎకరాలున్నాయనీ.. అక్కడ ఏరో సెంటర్ ఏర్పాటు చెయ్యాలా.. ఇంకా ఏమైనా రూపొందించాలా అనే అంశం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లనున్నట్లు వివరించారు. ఇంకా ఆయన ఏమన్నారంటే..

ఎంఐజీ ప్రాజెక్టులకు స్పందన : రెవెన్యూ పెంపొందించేందుకు ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. ముఖ్యంగా లే అవుట్ డెవలప్‌మెంట్ ప్రారంభించాలని భావిస్తున్నాం. ఇటీవల 5 ఎంఐజీ ప్రాజెక్టులు ప్రారంభించాం. ఇందులో కొన్నింటికి అనూహ్య స్పందన వచ్చింది. మిగిలిన వాటిపైనా దృష్టిసారిస్తున్నాం. ఎల్‌ఐజీ లేఅవుట్స్ ఎక్కడ వేయాలనేదానిపై అభిప్రాయాలు సమీకరిస్తున్నాం. గతంలో వీఎంఆర్‌డీఏ ఆధ్వర్యంలో వేసిన ఎల్‌ఐజీ లే అవుట్స్ హాట్‌కేకులుగా అమ్ముడయ్యాయి. సంస్థకు గతేడాది రూ.120 కోట్లు ఆదాయం రాగా.. రెండేళ్ల క్రితం ఒక్క సెంటు భూమి ప్రాజెక్టుల ద్వారా రూ.300 కోట్లు ఆదాయం వచ్చింది. ల్యాండ్ పూలింగ్ ద్వారా ఆస్తులతో మరో రూ.355 కోట్లు ఆదాయం లభించింది.

ఎంజాయ్‌కి డెస్టినేషన్.. కైలాసగిరి : కైలాసగిరిపై ప్రస్తుతం ఉన్న సౌకర్యాలతో పాటు కొత్తగా ప్లానిటోరియం నిర్మించేందుకు ప్రయత్నిస్తున్నాం. ఇప్పటికే ప్లానిటోరియం ప్లాన్ ఇచ్చేందుకు బిర్లా ప్లానిటోరియం లేఖరాసింది. దీంతో పాటు ఫుడ్ జోన్, హిస్టారిక్ జోన్, మ్యూజియం జోన్‌లతో కూడిన ఎంటర్‌టైన్‌మెంట్ జోన్లతో కూడిన అమ్యూజ్‌మెంట్ పార్క్‌ని ఏర్పాటు చేయాలని భావిస్తున్నాం.

ప్రత్యేక జోనల్ మ్యాప్

వీఎంఆర్‌డీఏ పరిధిలో చేపట్టనున్న అభివృద్ధి ప్రాజెక్టులకు సంబంధించి ప్రత్యేక జోనల్ మ్యాప్ తయారు చేయనున్నాం. ప్రపంచ బ్యాంకు నిధులతో చేపట్టిన కొన్ని ఆఫ్ బిల్ట్ నిర్మాణాలపైనా దృష్టి సారిస్తున్నాం. కైలాసగిరిపై అర్ధాంతరంగా నిలిచిపోయిన పనులు పూర్తి చేస్తాం. ఇక్కడ హాస్పిటాలిటీ జోన్ కింద రివాల్వింగ్ రెస్టారెంట్ ఏర్పాటు చేస్తాం. వెడ్డింగ్ డెస్టినేషన్ మాదిరిగా మారనుంది. ఢిల్లీ, ముంబైలో మాదిరిగా.. కన్వెన్షన్ సెంటర్, థియేటర్ యాక్టివిటీస్, ఫెస్టులు నిర్వహించే విధంగా.. ఆర్ట్ ఆఫ్ ది కాంప్లెక్స్‌కు ఆసక్తి వ్యక్తీకరణ టెండర్లను పిలవనున్నాం. మధురవాడ ప్రాంతంలో అర్బన్ ఎంటర్‌టైన్‌మెంట్‌జోన్ ఏర్పాటు చేసి ఏఐ పార్కు వంటి విభిన్న పార్కులు తీసుకొస్తాం. సిటీ సెంట్రల్ పార్క్‌లో స్నో వరల్డ్ ఏర్పాటు కానుంది. ఈ ప్రాజెక్టుల సాధ్యాసాధ్యాలపై నిపుణులతో చర్చించనున్నాం.

ఐటీ టవర్స్ ఏర్పాటుకు అడుగులు : రుషికొండ–మారికవలస సమీపంలో ఐటీ పార్క్ ఏర్పాటు చేయనున్నాం. ప్లగ్ అండ్ ప్లే విధానంలో ఐటీ కంపెనీలకు సమగ్ర సౌకర్యాలు కల్పించేలా 4 ఐటీ టవర్స్ ప్లాన్ చేస్తున్నాం. రూ.31 కోట్లతో ఒక టవర్, రూ.14 కోట్లతో మరో టవర్‌ని ఏర్పాటు చేయడంతో పాటు 5 స్టార్ హోటల్, కమర్షియల్ కాంప్లెక్స్ ఇలాంటివన్నీ ఒకే చోట సిద్ధం చేస్తాం.

3 నెలల్లో మల్టీలెవల్ కార్ పార్కింగ్ : వీఎంఆర్‌డీఏ భవన్ ఎదురుగా మల్టీ లెవల్ కార్ పార్కింగ్ ప్రాజెక్టు పనులు చురుగ్గా సాగుతున్నాయి. 3 నెలల్లో అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నాం. ఎన్ఏడీ జంక్షన్‌లో ఆర్‌వోబీ పూర్తి చేసిన తర్వాత కాకానినగర్ వద్ద సబ్‌వే ఏర్పాటు చేయనున్నాం. జీవీఎంసీ, వీఎంఆర్‌డీఏ పరిధిలో ఉన్న చెరువుల సంరక్షణపైనా దృష్టి సారిస్తున్నాం.

వీఎంఆర్‌డీఏలో డిజిటలైజేషన్ : వీఎంఆర్‌డీఏని డిజిటలైజేషన్ చేయనున్నాం. చిల్డ్రన్ థియేటర్, కల్యాణ మండపాల బుకింగ్‌లు, చెల్లింపులన్నీ డిజిటలైజేషన్ చేస్తాం. షాపింగ్ కాంప్లెక్స్ అద్దెలు చెల్లించే విధానాన్ని కూడా ఆన్‌లైన్‌లో జరిగేలా సాఫ్ట్‌వేర్ అభివృద్ధి చేస్తున్నాం. సంస్థకు సంబంధించిన వెబ్‌సైట్‌లో లీగల్, ల్యాండ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్స్, ఐటీ సెల్ ఏర్పాటు చేయనున్నాం. సిబ్బంది కొరత వేధిస్తోంది. ఆయా విభాగాల్లో ఖాళీలు భర్తీ చేయాలని ప్రభుత్వానికి నివేదిక అందిస్తాం.

తల్లి పాలలో సంపూర్ణ పోషకాలు

మహారాణిపేట: తల్లి పాలలో సంపూర్ణ పోషకాలు ఉంటాయని, అవి బిడ్డలో రోగనిరోధక శక్తి వృద్ధి చెందేందుకు తోడ్పడతాయని కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో స్థానిక విక్టోరియా ఆస్పత్రిలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ బిడ్డ పుట్టిన వెంటనే తల్లికి మొదటిసారిగా వచ్చే ముర్రుపాలలో ప్రొటీన్ ఎక్కువగా, షుగర్ తక్కువగా ఉంటుందని, బిడ్డకి కావాల్సిన ప్రతీదీ ఈ కొలొస్ట్రమ్‌లో ఉంటుందని వివరించారు. దీనిని ఏ ఫార్ములా కూడా రీప్లేస్ చేయలేదన్నారు. ఈ సందర్భంగా బాలింతలకు పోషకాహార కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ విక్టోరియా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఉషా



బాలింతకు పోషకాహార కిట్ అందిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

ప్రసాద్, డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖాధికారి డాక్టర్ జి.జయదేవి, విక్టోరియా ఆస్పత్రి సీఎస్ఆర్ఎంవో డాక్టర్ పి.రాధారాణి, ఎస్.ఎన్.సి.యు.నోడల్ ఆఫీసర్ డాక్టర్ పి.బింధుమాధవి పాల్గొన్నారు.

యువకుడి బ్రెయిన్ డెడ్

- అవయవదానానికి అంగీకారం



మహేష్ (ఫైల్)

పరవాడ: తాను మరణించినా మరి కొందరి జీవితాల్లో వెలుగులు నింపనున్నాడు పాత రాజానపాలెం గ్రామానికి చెందిన మండల మహేష్. ప్రమాదవశాత్తు తలకు గాయమై, బ్రెయిన్ డెడ్ అయిన యువకుడి అవయవదానానికి కుటుంబ సభ్యులు ముందుకు వచ్చారు. వివరాలివి.. పరవాడ మండలం నాయుడుపాలెం శివారు పాత రాజానపాలెం గ్రామానికి చెందిన మండల మహేష్(32) గురువారం ఉదయం కొబ్బరికాయలు తీసేందుకు చెట్టు ఎక్కి, కాలు జారి కిందపడిపోయాడు. తలకు తీవ్ర గాయం కావడంతో మహేష్‌ను చికిత్స నిమిత్తం షీలానగర్‌లోని కిమ్స్ ఐకాన్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్య పరీక్షలు చేసిన వైద్యులు మహేష్‌కు బ్రెయిన్‌డెడ్ అయినట్లు నిర్ధారించారు. అతడి అవయవాలను దానం చేసేందుకు కుటుంబ సభ్యులు అంగీకరించారు. దీంతో ఆదివారం ఉదయం అవయవాలను దానం చేయనున్నారు.

స్వగ్రామంలో అంతిమ సంస్కారాలు

మహేష్ అంత్యక్రియలను మృతుడు స్వగ్రామం పాతరాజన్నపాలెంలో ఆదివారం నిర్వహించనున్నామని కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడు మహేష్‌కు వివాహం కాలేదు. తల్లి ముత్యాలమ్మ, ముగ్గురు అక్కచెల్లెళ్లు ఉన్నారు. తండ్రి ఎర్రినాయుడు మృతి చెందారు. మహేష్ మృతిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని సీఐ ఎస్.బాలసూర్యారావు చెప్పారు.

పోలీసులపై దాడులను ఉపేక్షించేది లేదు

విశాఖ సిటీ: పోలీసులపై దాడులకు పాల్పడితే ఎవ్వరినీ ఉపేక్షించేది లేదని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ఒక ప్రకటనలో హెచ్చరించారు. పోలీసుల విధులకు ఆటంకం కలిగించినా, బెదిరింపులకు దిగినా, అసభ్యకరంగా ప్రవర్తించినా కఠిన చర్యలు తీసుకుంటామని తేల్చి చెప్పారు. గత నెల 13వ తేదీన మద్యం తాగి దుర్భాషలాడుతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకోవాలని ప్రయత్నించిన కానిస్టేబుల్‌పై దాడి చేసిన వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించినట్లు తెలిపారు. అలాగే గత 15న మద్దిలపాలెం ప్రాంతంలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పరీక్షకు నిరాకరించడంతో పాటు బెదిరింపులకు పాల్పడిన అయిదుగురిపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి 41ఏ నోటీసులు జారీ చేసినట్లు వెల్లడించారు. అదే విధంగా గత నెల 29న ఎంవీపీ పోలీస్‌స్టేషన్ పరిధిలో తన భర్త ఇంటి వద్ద గొడవ చేస్తున్నాడని భార్య ఫిర్యాదుతో అక్కడకు వెళ్లి సర్దిచెప్పే ప్రయత్నం చేసిన కానిస్టేబుల్‌పై నకుల్ ఫిస్ట్‌తో దాడి చేసిన నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. పోలీసులపై దాడులకు పాల్పడినా, విధులకు అవరోధం కలిగించినా సహించేది లేదని స్పష్టం చేశారు.

మాస్టర్ ప్లాన్ వివరాలు సమగ్రంగా ఇవ్వండి

సాక్షి, విశాఖపట్నం: వీఎంఆర్డీఏ పరిధిలో అభివృద్ధికి సంబంధించి రూపొందించిన మాస్టర్ ప్లాన్- 2024కి సంబంధించిన సమగ్ర వివరాలు వెంటనే అందించాలని మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ అధికారులను ఆదేశించారు. విశాఖలో పర్యటించిన మంత్రి నారాయణ, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుతో కలిసి వీఎంఆర్డీఏ కమిషనర్ విశ్వనాథన్ తోపాటు పలు ముఖ్య విభాగాల అధికారులతో శనివారం రాత్రి సమావేశమయ్యారు. మాస్టర్ ప్లాన్‌లో ఉన్న రహదారులు, అభివృద్ధి విభాగాలకు సంబంధించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. తాము సూచించిన అంశాల ప్రకారం మాస్టర్ ప్లాన్‌లో కొన్ని మార్పులు చేర్పులు చేయాల్సి ఉంటుందని దానికి అనుగుణంగా చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు.

అమ్మ.. నాన్న ఉంటే ప్రేమ. నేస్తమో.. నెచ్చెలో ఉంటే ధీమా. పదాల మూర్తి చిన్నదే.వాటి స్ఫూర్తి ఉన్నతం. కీర్తి సమున్నతం! వాటితో జీవితానికో అర్థం. వాటితోనే జీవితానికి ఓ పరమార్థం. వాటితోనే బుడిబుడి అడుగుల బాల్యం..వడివడి నడకల ప్రాజ్ఞత నేర్పే అమూల్యం అవుతుంది. నిజమైన స్నేహితుడు కాలంతోపాటే కనుమరుగైపోడు. కాలానికి..కత్తుల వంతెనకు వారధిలా నిలుస్తాడు. కాలపరీక్షలో నిన్ను గెలిపిస్తాడు. అందుకే మనిషి అనుభవాన్ని మీదపడ్డ సంవత్సరాలలో కాదు.. దగ్గరున్న స్నేహితుల సమూహాన్ని బట్టి లెక్కించాలి. ఆ మిత్ర బృందంలో క్షణాలు అద్భుతంగా తోస్తాయి. సంరక్షణగా స్నేహబాంధవ్యంతో కొత్త లోకంలోకి తీసుకుపోతాయి. **అదే కొత్త బంగారు లోకం**..అదే అదే స్నేహ మాధుర్య మరో ప్రపంచం.

హ్యాపీ ఫ్రెండ్‌షిప్‌డే.. : ఈరోజు తలపులోకి రాగానే ఎదలోతులో..ఏమూలనో..నిదురించే జ్ఞాపకాలు నిద్ర**లేస్తున్నాయి** కదూ.. ఔను ఫ్రెండ్‌షిప్‌డే అంటే ఎన్నో జ్ఞాపకాలు.. మ**రెన్నో మధుర** స్మృతులు కళ్లముందు కదలనిదెవరికి? ఆగొద్దు. ఆ లో**కంలో అలానే** విహరించండి! ఒక్కసారి కళ్లు మూసుకోండి... **అద్భుత స్నేహలోకం** కనిపిస్తుంది కదూ.. ఫ్రెండ్ దగ్గర ఉంటే హాయిగా హగ్ **చేసుకోండి.** లేదంటే ఫోన్ తీసుకోండి. విష్ చేస్తూ ఓ మెసేజ్ పెట్టం**డి. ఫ్రెండ్ నుంచి** వచ్చే సందేశాన్ని మదిలో మననం చేసుకోండి. సృష్టిలో **తీయనిది** స్నేహమే. అనుకుంటూ సంతోషంగా స్నేహగీతం పాడు**కోండి.**



చెరగని చందం... చెలిమికి బంధం



స్నేహితుల దినోత్సవ వేడుకల్లో సేక్రెడ్ హార్ట్ విద్యార్థినులు

కేరాఫ్ కంచరపాలెం



వికరాబాద్‌లో విహారయాత్రలో జోన్-5 కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ అతని స్నేహితులు (ఫైల్)

కంచరపాలెం: చిన్ననాటి నుంచి కంచరపాలెం జ్ఞానాపురం ప్రాంతాల్లో నివాసం ఉంటూ ఆర్‌సీ ఎంసీ పాఠశాలలో ప్రాథమిక, సేక్రెడ్ హార్ట్ బాలికోన్నత పాఠశాల, సెయింట్ జోసెఫ్‌లో ఇంటర్, పీజీలు పూర్తి చేశారు. 1990–2021 మధ్య చదువుకున్న స్నేహితులంతా వివిధ హోదాల్లో స్థిరప**డ్డారు. ప్రతి ఏడాది స్నే**హితుల దినోత్సవం వీరం**తా కలుసుకోవడం విశే**షం. ఆదివారం సెయింట్ **జోసెఫ్ చర్చిలో కలుసు**కుని తరువాత విందు **వినోద కార్యక్రమాలు** జరుపుకుంటామని నాటి **స్నేహితులు తెలిపారు.**

కలకాలం నిలవాలి



ఇతరుల మేలుకోరే మనస్తత్వం, వారి అంతర్యాన్ని అర్థం చేసుకునే ప్రయత్నం, అవసరమైతే ఓ చిన్న ఓదార్పు, ఓ మాటసాయం ..అంతేనండి..ఎదుటివారు మన స్నేహితులుగా **మారి**పోతారు. మనలో నిజాయతీ, స్నేహంలో నిస్వార్థం తొంగిచూశాయంటే స్నేహం కలకాలం నిలుస్తుంది.

–ఆర్‌జీవీ కృష్ణ, జోనల్ కమిషనర్ జోన్5 జ్ఞానాపురం

స్నేహ సంపద మిన్న



ఆపదలో ఆదుకునే మొదటి వ్యక్తి స్నేహితుడే. దైవం మీకు చేయదలిచిన ఉపకారం, సహకారం స్నేహితుని ద్వారానే చేకూరుస్తాడనేది నా అభిప్రాయం. మా కు**టుంబం**లో 'స్నేహం' చేసిన మేలు ఎంతో ఉంది.

– డి.దివాకర్, గోపాలపట్నం మండల విద్యాశాఖాధికారి–2

నడిపించే శక్తి ..



అంతరాలు మరచి తరాల భేదం విడిచి ఒక్కటిగా చేసేది స్నేహం. మనతో నడిచి, మనల్ని నడిపించే శక్తి స్నేహానికుంది. తను లే**ని** లోటు తెలియకుండా అన్నిం**టి కంటే** విలువైన అనుబంధం అందించేదే స్నేహం.

–సీహెచ్ సుబ్బిరెడ్డి, జిల్లా ఎంప్లాయ్‌మెంట్ అధికారి

అర్థం చేసుకునేవారు ఉండాలి



స్నేహం అనే పదం తెలియకుండా ఈ ప్రపంచంలో ఎవరూ ఉండరు. మంచి మనిషిని, మనసున్న వారిని,మనలను అర్థం చేసుకునేవారిని స్నేహితులుగా **ఎం**చుకోవాలి. అప్పుడే ఆ స్నేహం చిరకాలం నిలుస్తుంది.

–పల్లా శశికళ, ఏయూ సీహెచ్‌టీ స్కాలర్

మీరే సమస్తం మిత్రమా...



చదువులమ్మ ఒడిలో కలిసిమెలసి చదివాం. తీయని అనుభూతిలో ప్రతిక్షణం గడిపాం. ఆపద సమయాల్లో ఆప్తమిత్రులయ్యారు. కష్టసుఖాలలో భాగస్వాము**ల**య్యాం. మా మిత్రబృందమే బలం.

–ఆర్ శ్రీనివాసరావు, ఆర్పీపేట ఉన్నత పాఠశాల హెచ్ఎం.

స్వార్థం లేనిది



స్వార్థం లేనిదే నిజమైన స్నేహం. అవసరం కోసం స్నేహం చేయవద్దు. స్నేహాన్ని అబ్బాయిలు ప్రేమతో ముడిపెట్టకూడదు. విజయం సాధించినపుడు అ**భి**నందించేవాడు. కష్టమొచ్చిన వేళ నేనున్నాననే ధైర్యం ఇచ్చే వాడే స్నేహితుడు.

–గొర్లె చందు, పోర్టు ట్రస్ట్ ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు

ఆలంబనంగా ఉండేది



స్నేహం కాలక్షేపం కాకూడదు. కష్టంలో తోడుగ నిలబడగలిగాలి. ప్రాణమున్నంత వరకు ఒకరికొకరు విలువనిస్తూ ఆలంబనగా ఉండాలి. స్నేహాన్ని అనుభవిస్తేనే ఆ విలువ తెలుస్తుంది

–డాక్టర్ ఆచార్య తిరులమలాంబ, ఐఏఎస్ఈ, ఏయూ

పరిపూర్ణతకు అర్థం స్నేహం...



వేదనలో తల్లిలా ఊరడించేది.. విజయసాధనలో వెన్నుతట్టే గురువులా ప్రోత్సహించేంది స్నేహితుడు. జీవితానికి అర్థం చెప్పేది స్నేహం. స్నేహం విలువైనది. దానిని కాపాడుకుందాం.

–కల్యాణి, డ్రాయింగ్ టీచర్, కప్పరాడ

స్నేహానికి నిర్వచనం ఫ్యాబ్



అనాథ పిల్లల ఆశ్రమానికి కంప్యూటర్ వితరణ

భీమునిపట్నం: స్నేహానికి ఉన్న విలువ అన్నింటికన్నా ప్రత్యేకమైంది. స్నేహితులు పక్కన ఉంటే ఆ ఆనందం, ఆ బలం వేరు. చదువుకున్న రోజుల్లో స్నేహాలు జీవితంలో స్థిరపడినతరువాత కూడా కొనసాగిస్తూ పదిమందికి ఆదర్శంగా నిలుస్తున్నారు ఫ్రెండ్స్ అసోసియేషన్ భీమిలి(ఫ్యాబ్) సభ్యులు. భీమిలిలో 2014లో కాళ్ల సన్నీ తన స్నేహితులతో కలిసి ఫ్యాబ్‌ను ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి స్నేహితులంతా కలిసి అనేక సేవాకార్యక్రమాలు చేస్తున్నారు. ఆపదలో ఉన్న స్నేహితులకు సాయ పడడం, పేద విద్యార్థుల చదువుకు ఆర్థిక సాయం చేసే కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. ఏడాదికి రూ.5 లక్షల వరకూ ఆర్థిక సాయాన్ని అందిస్తున్నారు. పేద స్నేహితుల పిల్లల వివాహాలకు సాయం చేస్తున్నారు, భీమిలిలో అవసరమైన చోట్ల సుమారు రూ.5లక్షలతో 70 సిమెంట్ బెంచీలను ఏర్పాటు చేశారు. ముఖ్యంగా వారు చిన్నప్పుడు చదువుకున్న సెయింట్ ఆన్స్ స్కూల్‌కు రూ.3 లక్షలతో స్మార్ట్ క్లాసుల కోసం ప్రొజెక్టర్, రూ.40వేలతో సైకిల్ స్టాండ్ ఏర్పాటు చేశారు. భీమిలి అందాలు, చరిత్రను తెలిపే జయహో భీమిలి అనే వీడియో పాటను చిత్రీకరించి దాన్ని ప్రముఖ రచయిత, నటుడు తనికెళ్ల భరణి చేతుల మీదుగా విడుదల చేయగా మంచి ఆదరణ లభించింది.

మా వంతు సాయం



పేద స్నేహితులతోపాటు అవసరాల్లో ఉన్న ఇతరులకు కూడా చేతనైన విధంగా సాయం చేయాలన్న ఉద్దేశంలోనే ఈ ఫ్యాబ్‌ను ఏర్పాటు చేశాం. ఇందులోని అందరం బాధ్యతగా ఉంటూ సహాయ, సహకారాలు అందిస్తున్నాం. దీన్ని ఇలాగే కొనసాగిస్తు మరిన్ని సేవలు చేయాలన్నదే మా కోరిక.

–కాళ్ల సన్నీ, ఫ్యాబ్ వ్యవస్థాపకుడు, భీమిలి

అవయవదానంపై అపోహ వద్దు

సీతమ్మధార: అపోహలు వీడి అవయవదానానికి అందరూ స్వచ్ఛందంగా ముందుకు రావాలని కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ పిలుపునిచ్చారు. దాతలు సరైన సమయంలో స్పందించకపోవటం వలన ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఐదేళ్లలో రాష్ట్రంలో 90 వేల మందికి అవయవాలు అవసరం కాగా 923 మందికి మాత్రమే అందించగలిగామని గుర్తు చేశారు. సావిత్రిభాయ్ పూలే ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్‌కు అనుసంధానమైన ఆల్ ఇండియా బాడీ అండ్ డోనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 15వ తేదీ వరకు నిర్వహించనున్న అవయవదాన ఉత్సవాల్లో భాగంగా ర్యాలీని కలెక్టర్ ప్రారంభించారు. కార్యక్రమంలో కేజీహెచ్ సూపరింటెండెంట్ డా.కె.శివానంద, అఖిల భారత అవయవదాతల సంఘం చైర్‌పర్సన్ గూడూరు సీతామహాలక్ష్మి, అనాటమీ డిపార్టుమెంట్ ప్రొఫెసర్లు, వైద్యాధికారులు, నర్సింగ్ స్టాఫ్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా తైక్వాండో పోటీలు

విశాఖ స్పోర్ట్స్: జాతీయ తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీల్లో భాగంగా నిర్వహించిన పూమ్‌సే మేల్ క్యాడెట్ పోటీల్లో సిద్ధార్థ సింగ్, ఫిమేల్ క్యాడెట్ పోటీల్లో తెర్దిమిన్ స్వర్ణాలందుకున్నారు. పోర్ట్ ఇండోర్ స్టేడియంలో శనివారం జరిగిన మేల్ క్యాడెట్‌లో తంగు తలి రజతాన్ని, సిమంతదాస్, ఆర్నవ్ దిలీప్ కాంస్యాలందుకున్నారు. ఫిమేల్ క్యాడెట్‌లో డెజ్జిమోన రజతాన్ని, భవ్య, జునుకరభా కాంస్యాలందుకున్నారు. తైక్వాండో సమాఖ్య సహకారంతో రాష్ట్ర తైక్వాండో సంఘం ఆధ్వర్యంలో కోరుగి పోటీలు ఉత్సాహంగా జరిగాయి. మేల్ క్యాడెట్ అండర్ 148 సెంటీమీటర్ల ఎత్తు కేటగిరీలో ఆర్యన్ రాకేష్ స్వర్ణాన్ని అందుకోగా మోహిత్ భగేల్ రజతాన్ని, వెంకట ధనుష్, నిహాల్ కాంస్యాలందుకున్నారు. అండర్ 160లో తర్నికమ్ స్వర్ణాన్ని, రమిత్ రజతాన్ని, రోహిత్, లాంచెంబా సింగ్ కాంస్యాలందుకున్నారు. అండర్ 172లో హిమాంశు స్వర్ణాన్ని, ఆదిత్య శ్రీవాస్తవ రజతాన్ని, పునిత్, సుధీర్ యాగిక్ కాంస్యాలందుకున్నారు. ఓపెన్ 180లో అర్మన్ సింగ్ స్వర్ణాన్ని, ఉత్కర్ష్ రజతాన్ని, అభినవ్ శుభమ్ దారా కాంస్యాలందుకున్నారు. విజేతలకు విశాఖ నగర సీపీ శఖబ్రాత బాగ్చి పతకాలందించారు.

సరికొత్త రంగుల్లో సుజుకి స్కూటర్ల ఆవిష్కరణ



సుజుకి స్కూటర్లను ఆవిష్కరిస్తున్న సీఐ శ్రీనివాసరావు

గాజువాక : సుజుకి మోటార్ సైకిల్స్ నుంచి సరికొత్త రంగుల్లో విడుదలైన సుజుకి యాక్సిస్, ఎవనీస్, బర్గ్‌మేన్ స్కూటర్లను పద్మజ సుజుకిలో గాజువాక సీఐ శ్రీనివాసరావు, సుజుకి ఏరియా మేనేజర్ వంశీ శనివారం ఆవిష్కరించారు. అనంతరం సుజుకి ప్రతినిధి వరుణ్‌దేవ్ మాట్లాడుతూ సుజుకి యాక్సిస్, ఎవనీస్, బర్గ్‌మేన్ స్కూటర్లు ఇప్పుడు ఆకర్షణీయమైన రంగుల్లో ఆవిష్కరించామని, ప్రస్తుత మార్కెట్ ట్రెండ్‌కు అనుగుణంగా అధునాతన సుగుణాలతో స్కూటర్లు విడుదలయ్యాయన్నారు. సుజుకి యాక్సిస్ స్కూటర్ మెటాలిక్ సోనోమా రెడ్, పెరల్ మిరేజ్ వైట్ రంగుల్లోను, ఎవనీస్ స్కూటర్ ఛాంపియన్ ఎల్లో 2.0, గ్లాసీ స్పార్కల్ బ్లాక్ రంగుల్లోను, బర్గ్‌మేన్ స్కూటర్ మెటాలిక్ మాట్ బ్లాక్ నంబర్ 2 రంగులో లభిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో వరుణ్ గ్రూప్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు వినోద్ కుమార్, వి.సుబ్బారావు, సీఎం రఫీ, పద్మజ తదితరులు పాల్గొన్నారు.

ఊరికి మేలు చేసే 'కమిటీ కుర్రాళ్లు'



మాట్లాడుతున్న నిహారిక

బీచ్‌రోడ్డు: ఊరికి మేలు చేసే కథాంశంతో కమిటీ కుర్రాళ్లు చిత్రం రూపొందిందని ఆ చిత్ర నిర్మాత, నటి నిహారిక కొణిదెల తెలిపారు. చిత్ర ప్రమోషన్‌లో భాగంగా శనివారం విశాఖలోని ఓ హోటల్‌లో మీడియా మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా నిహారికతో పాటు యూనిట్ సభ్యులు పాల్గొన్నారు.ఆమె మాట్లాడుతూ సినిమా ఈనెల 9న విడుదల కానుందన్నారు. ప్రముఖ నటుడు సాయికుమార్ కీలక పాత్రలో నటించారన్నారు. కొత్తవాళ్లే తీస్తున్న చిత్రమన్నారు. విశాఖకు చెందిన ప్రసాద్, సందీప్, రుషిక ఈ చిత్రంలో నటించారన్నారు. అనంతరం చిత్ర యూనిట్ బీచ్ రోడ్డులో ర్యాలీ చేసింది.